


8న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రాక

కర్నూలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ నెల 8న జిల్లాకు రానున్నారు. 7వ తేదీ రాత్రి 7:45 గంటలకు విజయవాడ నుంచి రైలులో బయలుదేరి 8వ తేదీ ఉదయం గుంతకల్లుకు చేరుకుంటారు. అక్కడి నుంచి పత్తికొండ నియోజకవర్గంలోని హంద్రీనీవా కాలువ 106 కిలోమీటర్ల వద్ద డీప్ కట్‌ను పరిశీలిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు కర్నూలు స్టేట్ గెస్ట్ హౌస్ చేరుకుని పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.



పత్తి రైతుపై విత్తన భారం..!



- పత్తి విత్తనాల ప్యాకెట్ మీద రూ.37 పెంపు
- ప్రస్తుతం రూ.864.. వచ్చే ఖరీఫ్ నుంచి రూ.901
- ఉమ్మడి జిల్లాలో రెండున్నర లక్షల హెక్టార్లలో పత్తిసాగు
- 15 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం
- పత్తి రైతుపై భారం రూ.6.50 కోట్లు

రైతుల పంట ఉత్పత్తులకు మద్దతు ధర అందించడానికి కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. విత్తనాలు, క్రిమిసంహారక మందుల తయారీ కంపెనీల యాజమాన్యాలకు మాత్రం వాటి ధరలు పెంచుకునే అనుమతి ఇస్తోంది. ఖరీఫ్‌లో సాగయ్యే పత్తి విత్తన తయారీ సంస్థలకు ధరలు పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇప్పటి దాకా ఒక ప్యాకెట్ పత్తి విత్తనం ధర రూ. 864 ఉండగా వచ్చే ఖరీఫ్ నుంచి రూ.901 వరకు పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఒక ప్యాకెట్‌పై రూ.37 అదనంగా పెరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 2.50 లక్షల హెక్టార్లలో పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఈ రెండున్నర లక్షల హెక్టార్లకు దాదాపు 15 లక్షల విత్తన ప్యాకెట్లు అవసరం. పెంచిన ధర ప్రకారం ఉమ్మడి జిల్లాలో పత్తి రైతులపై రూ.6.50 కోట్ల దాకా అదనపు భారం పడనుంది.



కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్‌లో అధిక విస్తీర్ణంలో పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు, కర్నూలు, పత్తికొండ, పాణ్యం, నందికొట్కూరు, డోన్, నంద్యాల తదితర నియోజకవర్గాల్లో దాదాపు ఖరీఫ్‌లో రెండున్నర లక్షల హెక్టార్లలో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పటికే పత్తి పంట సాగులో రైతులు అనేక వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నారు. ఎకరా పత్తి పంట సాగుకు దాదాపు 20 నుంచి 30వేల దాకా ఖర్చు చేస్తున్నా గిట్టుబాటు కావడం లేదు. సీసీఐ అధికారులు రైతులు పండించిన పత్తి పంటను కొనుగోలు చేసేందుకు ఏటా ముప్పుతిప్పలు పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం క్వింటం పత్తికి రూ.7,521 మద్దతు ధరగా ప్రకటించింది. ఈ ధరను అందించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అనేక కొర్రీలు పెడుతుండటంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. క్వింటం పత్తిని రూ.6వేల నుంచి రూ.6,500లకు విక్రయించి నష్టపోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఈ పరిస్థితుల్లో తమపై మరింత భారం పెంచేలా విత్తన ధరను పెంచుకునేందుకు పత్తి విత్తన తయారీ యజమానులకు కేంద్రం అనుమతించడాన్ని రైతుఉ విమర్శిస్తున్నారు.

● నల్లరేగడి భూముల్లోనే పత్తి సాగు:



ఉమ్మడి కర్నూలు జిల్లాలో 75 శాతం నల్లరేగడి భూములు ఉన్నాయి. ఈ భూములు పత్తి పంట సాగుకు ఎంతో అనుకూలమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒకప్పుడు వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం వంటి పంటలను రైతులు అధికంగా సాగు చేసేవారు. కాలక్రమేణా ఆ పంటలు గిట్టుబాటు కాకపోవడంతో కేంద్రం పత్తికి మద్దతు ధరను క్వింటానికి రూ.7,500 పెంచడం వల్ల గత ఐదేళ్ల నుంచి పత్తి పంట విస్తీర్ణం ఉమ్మడి జిల్లాలో భారీగా పెరుగుతోంది. ప్రస్తుతం రెండున్నర లక్షల హెక్టార్లలో ఖరీఫ్‌లో పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు.

● గత ఆరేళ్లుగా పెరిగిన పత్తి విత్తన ధరలు

సంవత్సరం	ఒక ప్యాకెట్ ధర (450 గ్రాములు)
2020	రూ.730
2021	రూ.767
2022	రూ.810
2023	రూ.853
2024	రూ.864
2025	రూ.901
	(వచ్చే ఖరీఫ్‌కు ధర)

పత్తి ధర ఖరీఫ్ నుంచి అమలులోకి వస్తుంది



కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తన ధరను పెంచేందుకు పత్తి విత్తన తయారీ కంపెనీలకు అనుమతి ఇచ్చింది. ఒక ప్యాకెట్ (450 గ్రా) ధర ఇప్పటి దాకా రూ.864 ఉండగా.. ఇకపై రూ.901కు పెంచుకునేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ ధరలు వచ్చే ఖరీఫ్‌కు అమలవుతాయి. రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా డీలర్ల నుంచి రశీదు తీసుకోవాలి. వాతావరణ పరిస్థితులు, నాసిరకం విత్తనాలు విత్తిన సమయంలో పంట ఏపుగా పెరగకపోతే సంబంధిత పత్తి కంపెనీల నుంచి నష్టపరిహారం అందుకునేందుకు డీలర్ల నుంచి తీసుకున్న రశీదు ఆధారంగా ఉంటుంది.

- వరలక్ష్మి, వ్యవసాయ శాఖ కర్నూలు జేడీ:

కర్నూలు- విజయవాడ విమాన సర్వీసులు ప్రారంభించండి

● కేంద్ర మంత్రిని కోరిన టీజీ భరత్



కేంద్ర మంత్రిని కలిసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభించాలని మంత్రి టీజీ భరత్ పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి కూడా సానుకూలంగా స్పందించారు. కర్నూలు నుంచి విమాన సర్వీసులపై అధికారులతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. కర్నూలు- విజయవాడ విమాన సౌకర్యం కల్పించేందుకు కేంద్ర మంత్రి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇక్కడ అన్ని రకాల పరిశ్రమలు పెట్టేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని మంత్రి భరత్ తెలిపారు. అదేవిధంగా కర్నూలు నుంచి ముంబాయి, కర్నూలు నుంచి విజయవాడకు కొత్త రైలు సర్వీసులను ప్రారంభించాలని టీజీ భరత్ విన్నవించారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధిపై కూడా చర్చించారు. తమ ప్రతిపాదనపై రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారనీ టీజీ భరత్ వివరించారు. అలాగే రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ను కలిసి రక్షణ శాఖకు సంబంధించిన ప్రాజెక్టులు ఏపీలో ముఖ్యంగా కర్నూలులో ఏర్పాటు చేయాలని, ఏపీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారనీ వివరించారు.

బీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ 1,4 సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 1వ సెమిస్టర్‌లో 350 కి 148, 4వ సెమిస్టర్‌లో 108 మంది పరీక్షలు రాయగా 52 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

నేటి నుంచి 'పది' మూల్యాంకనం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి సమయం ఆసన్నమైంది. గురువారం నుంచి కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు క్రేడో ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పదో తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనానికి విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లాకు అన్ని సబ్జెక్టులు కలిపి దాదాపు 2లక్షల పరీక్ష జవాబు పత్రాలు వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. క్యాంప్ ఆఫీసర్‌గా జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ వ్యవహరిస్తారు. అదేవిధంగా 8 మంది అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, 1,200 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 600 మంది స్పెషల్ అసిస్టెంట్లతో పాటు మరో 300 మందిని విధులకు కేటాయించారు. పకడ్బందీగా పది పరీక్షల మూల్యాంకనం నిర్వహించేందుకు ఇప్పటికే ఉపాధ్యాయులకు అపాయింట్‌మెంటు ఆర్డర్లు కూడా అందజేసినట్లు డీఈఓ తెలిపారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు

6లో

విహారం..విషాదం..

- తుంగభద్ర నదిలో తండ్రి, ఇద్దరు కుమారులు మృతి
- సుంకేసులలో దుర్ఘటన



తండ్రి సులేమాన్, కుమారులు ఫర్హాన్, ఫైజాన్ (ఫైల్ ఫొటోలు)

రంజాన్ తర్వాత సరదగా గడిపేందుకు వెళ్లిన విహార యాత్ర విషాదాంతమై అంతిమయాత్రగా మారింది. బిజీ లైఫ్‌లో కాసేపు కుటుంబంతో సంతోషంగా ఉండాలనుకున్న వారి ఆశ కల్లోలమైంది. సరదా కోసం నీటిలో దిగిన తండ్రీ ఇద్దరు కుమారులు మునిగి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు గుండెలుపగిలేలా రోదించారు. తుంగభద్ర నదిలో మునిగి కర్నూలుకు చెందిన తండ్రి, ఇద్దరు కుమారులు మృతి చెందిన విషాద దుర్ఘటన కర్నూలు మండలంలోని సుంకేసులలో బుధవారం చోటు చేసుకుంది.

-వివరాలు 7లో..

డ్రిప్ ప్రగతిలో ఆరోస్థానం

● ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి



మాట్లాడుతున్న ఉమాదేవి

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డ్రిప్ ఏర్పాటులో కర్నూలు జిల్లా గణనీయమైన ప్రగతి సాధించి రాష్ట్రంలో ఆరోస్థానంలో నిలిచిందని ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. బుధవారం కర్నూలు నగరంలోని ఉద్యానశాఖ శిక్షణా కేంద్రంలో ఏపీఎంఐపీ చెందిన అధికారులు, ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ రైతులను కష్టాల నుంచి గట్టెక్కించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 నుంచి 100 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు నిధులను కేటాయించడం జరుగుతోందన్నారు. ఇటీవల కాలంలో డ్రిప్ అవసరాన్ని రైతులంతా గుర్తించారన్నారు. కర్నూలు జిల్లాలో ఇప్పటి దాకా 5,653 హెక్టార్లలో డ్రిప్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ పరిపాలనా అనుమతులు ఇచ్చారన్నారు. డ్రిప్పు, స్ప్రింకర్ల పరికరాలను ప్రస్తుతం 3,798 హెక్టార్లలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని, అందులో 2,500 హెక్టార్ల మేర రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలను సాగు చేస్తున్నారన్నారు. మే 15లోగా మిగిలిన విస్తీర్ణానికి డ్రిప్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ఏపీఎంఐపీ అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో నిమగ్నం కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, డ్రిప్ అభివృద్ధి అధికారి జయరామిరెడ్డి పాల్గొన్నారు.

పెరిగిన పత్తి ధర

● క్వింటా గరిష్ఠంగా రూ.7,855



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి ధరలు రోజురోజుకి పెరుగుతున్నాయి. బుధవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,855 పలికింది. గత వారంతో పోల్చితే క్వింటాపై రూ.250కి పైగా ధర పెరిగింది. పత్తి ధరలు మళ్లీ పెరగడంతో రైతులు నిల్వ ఉన్న పత్తిని అమ్ముకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో దూది ధరలు పెరగడం వల్ల ఆదోని మార్కెట్లో ధరలు పెరిగాయని కాటన్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నాయని తెలిపారు. బుధవారం మార్కెట్‌లో 471 క్వింటాళ్ల పత్తి విక్రయానికి వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.4,916, గరిష్ఠ ధర రూ.7,855 సగటున రూ.7,470 పలికింది.

జేఈఈ-మెయిన్స్-2 ప్రవేశ పరీక్ష ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రఖ్యాతి గాంచిన ఐఐటీ, ఎన్ఐటీ విద్యాసంస్థల్లో బీటెక్, బీఆర్క్, బీప్లానింగ్ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్-2 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష బుధవారం కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రారంభమైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీ వరకు కొనసాగుతాయి. పేపర్-1 ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగింది. రెండు గంటల ముందే పరీక్ష కేంద్రం గేటు వద్ద అభ్యర్థులను పరీక్ష నిర్వహకులు పరిశీలించి లోపలికి అనుమతించారు. అభ్యర్థులు వెంట తెచ్చుకున్న బ్యాగ్‌లు, సెల్‌ఫోన్లను భద్రపరుచుకోవడానికి డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు.



పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

బీటీ నాయుడు అను నేను..



అమరావతిలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు చేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న శాసనమండలి చైర్మన్ మోషెను రాజు

- ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన బీటీ
- హాజరైన మంత్రి అచ్చెన్నాయుడు, కాలువ శ్రీనివాసులు, తిక్కారెడ్డి

కర్నూలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి సభ్యుడిగా బీటీ నాయుడు బుధవారం ప్రమాణాస్వీకారం చేశారు. శుభముహూర్తం మధ్యాహ్నం 1:15 గంటలకు ఆయన శాసనమండలిలోని చైర్మన్ కార్యాలయంలో మండలి చైర్మన్ మోషెనురాజు బీటీ నాయుడు చేత ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి, ఏపీ కురవ/కురబ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డితో పాటు ఆదోని, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల నుంచి టీడీపీ శ్రేణులు, అభిమానులు విజయవాడకు తరలివెళ్లారు. శాసనమండలి సెక్రెటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, సెక్రెటరీ రాజ్‌కుమార్‌లు ఎమ్మెల్సీల ప్రమాణాస్వీకారానికి ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీగా బీటీ రెండోసారి బాధ్యతలు చేపట్టారు. ప్రమాణ స్వీకారానికి ముందుగా బీటీనాయుడు, సతీమణి పద్మ, కుమార్తె రవళికతో కలసి కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లను

మిగతా 6లో...

రేపు విజయవాడలో ఆర్యవైశ్య సమ్మేళనం

● విజయవంతం చేయాలని కుడా చైర్మన్ పిలుపు



కర్నూలు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 4న జరగనున్న ఆర్యవైశ్య సమ్మేళనం విజయవంతం చేయాలని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్.కన్వెన్షన్ హాలులో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్, జగ్గయ్య పేట ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్య ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంలో ఆర్యవైశ్యులు ఎంతో కృషి చేశారన్నారు. ఆర్యవైశ్యులకు చంద్రబాబు తగిన గుర్తింపు ఇస్తున్నారన్నారు. ఆర్యవైశ్య సమ్మేళనం కార్యక్రమానికి భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆర్‌యూ, క్లస్టర్ పాలనపై ఆరా..!

● ప్రిన్సిపాల్స్, రిజిస్ట్రార్లతో వీసీ భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీల పరిపాలనా తీరుపై ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ఉమా ఆరా తీశారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలో రెండు యూనివర్సిటీలకు చెందిన రిజిస్ట్రార్లు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్సిటీల్లో తరగతుల నిర్వహణ, పరీక్షల విభాగాల్లో అనుసరిస్తున్న పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు.

టీసీసీ శిక్షణకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) 42 రోజుల కోర్సుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శామ్యూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి జూన్ 11వ తేదీ వరకు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురం జిల్లా కేంద్రాల్లో శిక్షణా తరగతులు కొనసాగుతాయన్నారు. ఏప్రిల్ 25వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి చివరి గడువు అన్నారు. 2025 సంవత్సరం మే నెల ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండి 45 సంవత్సరాలోపు వయసు ఉన్న వారు అర్హులు అన్నారు. పదో తరగతి పాసై టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్ పూర్తి చేసి ఉండాలన్నారు. ఒకేషనల్ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మే ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని డీఈఓ వెల్లడించారు.

రేషన్ దుకాణాలపై దాడులు

● 6ఏ కేసులు నమోదు



ఎండీయూను తనిఖీ చేస్తున్న అధికారులు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని పలు రేషన్ దుకాణాలపై సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఎండీయూ ఆపరేటర్ నెంబర్11 వద్ద 539 కిలోల బియ్యం, 164 ప్యాకెట్ల చక్కెర, భౌతిక నిల్వల్లో తక్కువగా ఉన్నందున 6ఏ కేసు నమోదు చేశారు. రేషన్ దుకాణం నెంబర్ 113 డీలర్ వద్ద ఉండాల్సిన బియ్యం కన్నా 86 సంచుల బియ్యం తక్కువగా ఉన్నందువల్ల అతడిపై కూడా 6ఏ కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ రాజా రఘువీర్, ఏఎస్ఓ రామాంజనేయ రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

స్థిరంగా ఎండుమిర్చి ధరలు

● క్వింటా రూ.10,350



వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కి విక్రయానికి వచ్చిన ఎండుమిర్చి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఎండుమిర్చి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఎండుమిర్చి ధర క్వింటా గరిష్ఠంగా రూ.10,350 పలికింది. ధరలు పెరుగుతాయని రైతులు ఆశించినా ధరలో మార్పులు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. చాలా మంది రైతులు ఏసీ గోడౌన్లు లభించక వచ్చిన ధరకే పంటను విక్రయించుకుంటున్నారు. కనీసం కోత, రవాణా ఖర్చులు కూడా రావడం లేదని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మార్కెట్‌కు 2,508 బస్తాల ఎండుమిర్చి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర క్వింటా రూ.2,066, గరిష్ఠ ధర రూ.10,350, సగటున రూ.7,869 పలికింది.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతోపాటు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత బీజేపీ ప్రజా ప్రతినిధులు తీసుకుంటారని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో కూటమి బలంగా ఉన్నా మండలిలో వైసీపీకి మెజారిటీ వల్ల కొన్ని ఆటంకాలు ఎదురవుతున్నాయని అన్నారు. తాజాగా టీడీపీ, జనసేన, బీజేపీ నుంచి ఐదుగురు సభ్యులు మండలిలో కూటమి ప్రభుత్వం తరపున చేరడంతో బలం పెరిగిందన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు త్రికరణ శుద్ధితో ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పల్లెల్లో కొళాయిలు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వంలో జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి కొళాయి నీరిస్తూ పవన్ కల్యాణ్ పేదల దాహార్తి తీరుస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీగా తనను ఎంపిక చేసిన బీజేపీ అధిష్ఠానం, చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు వీర్రాజు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

● ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన



ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి మోకాళ్లపై నుంచుని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఫ్యాప్టో నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి మోకాలిపై వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో కో చైర్మన్, కర్నూలు ఫ్యాప్టో ఇన్‌చార్జి ప్రకాశ్‌రావు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ వేసి వెంటనే 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన అన్ని బకాయిలు ఇస్తామని చెప్పి కొన్నింటిని మాత్రమే పరిష్కరించారన్నారు. మిగిలిన వాటిని కనీసం కార్యాచరణ కూడా ప్రకటించలేదని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు సురేష్ కుమార్, ఏపీపీఎస్ (257)రాష్ట్ర నాయకులు రవికుమార్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సేవాలాల్ నాయక్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టాలని, చనిపోయిన ఉపాధ్యాయ, ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి మాట్లాడుతూ ఆంగ్ల మధ్యామంకు సమాంతరంగా తెలుగును కూడా కొనసాగించాలని తెలిపారు. ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్షుడు ఎస్.ఇస్మాయిల్ మాట్లాడుతూ 2022 నుంచి సరెండర్ లీవుల బకాయిలు ఉన్నాయనీ, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ భాస్కర్, రవికుమార్, నవీన్ పాటిల్, జనార్దన్, ఎల్లప్ప, ఏపీటీఎఫ్ రామకృష్ణ, కోశాధికారి రంగన్న, ఆప్టా నాయకులు రాజాసాగర్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రాముడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కరెకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, లక్ష్మయ్య మాదన్న పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు



బనగానపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఉత్సవాల సందర్భంగా జ్యోతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు చౌడేశ్వరీమాతకు ఉదయం అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, పసుపు కుంకుమ, పట్టువస్త్రాల అలంకరణ, కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఏపీ నుంచే కాక తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతపురం ధర్మవరానికి చెందిన శ్రీ అభయ హస్త సేవా సమితి ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి భాస్కరయ్య ఆచారిచే చౌడేశ్వరీ అమ్మవారికి దిష్టిచుక్క పెట్టిన అనంతరం అర్ధరాత్రి 1 గంట నుంచి నందవరం జ్యోతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. బనగానపల్లె, నందివర్గం పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో భక్తులకు మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. ప్రతి 15 నిముషాలకు బనగానపల్లె మీదుగా కర్నూలు, అనంతపురం జిల్లాలనుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను నడుపుతున్నారు.

నందవరం చౌడేశ్వరిమాతను

దర్శించుకున్న మంత్రి సత్యకుమార్



నందవరం చౌడేశ్వరీ మాత ఆలయంలో మంత్రి సత్యకుమార్

బనగానపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాతను బుధవారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ బుధవా రం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డితో పాటు ఆలయ పూజారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నందవరం చౌడేశ్వరీమాత జ్యోతి ఉత్సవాలకు హాజరైన మంత్రి అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన చేయించారు. ఈ సందర్భంగా ఆలయ పెద్దలు, అర్చకులు మంత్రిని సత్కరించారు. మంత్రి వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణయాదవ్, బీవీ.సుబ్బారెడ్డి, లింగన్న, హరికృష్ణగౌడ్, యా దగిరి, రవికుమార్, లోకేశ్వర్ రెడ్డి, చిన్నయ్యయాదవ్, బాలవెంకటేశ్వర్లు, శరత్‌చంద్రకుమార్, చల్లా దామోదర్‌రెడ్డి, శ్రీరాములు, చిన్నమద్దిలేటి, శేషన్నయాదవ్, శ్రీనివాసులు, సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

పశువుల కోసం నీటి తొట్టెలు : కలెక్టర్



దిన్నెదేవరపాడులో నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో పశువుల దాహం తీర్చించేందుకు దాదాపు 300 నీటి తొట్టెలను నిర్మిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. కర్నూలు మండలంలోని దిన్నెదేవరపాడు గ్రామ శివారులో పశువులకు నీటి తొట్టె నిర్మాణానికి బుధవారం కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి భూమి పూజ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒక్కొక్క నీటి తొట్టెలకు రూ. 34వేలు ఖర్చు అవుతుందని చెప్పారు. ఉపాధి హామీ పథకం నిధులతో వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10వ తేది లోపు నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. వేసవిలో నీటితొట్టెలను పశువులకు సంపూర్ణంగా వినియోగించుకోనే విధంగా పనులు చేపట్టాలని డ్వామా పీడీకి సూచించారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ ఉపాధి పథకం కింద సీసీం రోడ్లు, నీటి సంరక్షణ పనులతో పాటు వేసవికాలంలో మూగజీవాలకు దాహార్తి తీర్చుకునేందుకు ప్రభుత్వం నీటితొట్టెలను నిర్మించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ తహసీల్దార్ వెంకట రమేష్‌బాబు, డ్వామా పీడీ రమణయ్య, ఎంపీడీవో రఘునాథ్, సర్పంచ్ మాధవస్వామి, పంచాయతీ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కర్నూలుకు మాజీ సీఎం జగన్



కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కర్నూలుకు రానున్నారు. నగర శివారులోని జీఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి కుమార్తె వివాహనికి ఆయన హాజరవుతారని వైసీపీ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఉదయం 9:30 గంటలకు తాడేపల్లి నుంచి హెలీకాఫ్టర్‌లో ద్వారా బయలుదేరి నగరంలోని షైపర్ కళాశాల మైదానంలో ల్యాండ్ అవుతారు. అక్కడి నుంచి జీఆర్‌సీ ఫంక్షన్ హాల్‌కు వెళ్లి వధూవరులను ఆశీర్వదించి తిరిగి తాడేపల్లికి చేరుకుంటారు.



అవ్వకు స్వర్ణ కిరీటం

ఆదోని టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణ ప్రజలు తమ ఇంటి ఇలవేల్పుగా భావించే మహాయోగి లక్ష్మమ్మ అవ్వకు అలంకరించేందుకు ఆలయ నిర్వాహకులు 1.3 కిలోల బరువైన బంగారు కిరీటాన్ని తయారు చేయించారు. రూ.కోటి ఖర్చుతో ఈ విగ్రహాన్ని తయారు చేయించినట్లు ఆలయ చైర్మన్ రాచోటి రామయ్య బుధవారం వెల్లడించారు. కిరీటాన్ని అందంగా తయారు చేయడంలో సహకరించిన జీఆర్‌టీ జ్యూవెల్లర్స్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్వర్ణ కిరీటాన్ని 93వ రథోత్సవం రోజున అవ్వకు అలంకరించనున్నట్టు వెల్లడించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో హైకోర్టు రిజిస్ట్రార్లు



మహానందిలో హైకోర్టు రిజిస్ట్రార్లు

మహానంది, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో బుధవారం సాయంత్రం ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్లు నరసింహ ఆచారి, హరినాథ్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ధ్వజస్తంభం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పసుపుల సుబ్బారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. వీరితో పాటు విశ్రాంత రిజిస్ట్రార్ టి. వేణుగోపాల్‌రావు పాల్గొనగా ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వీరిని ఆలయ వేద పండితులు ఆశీర్వదించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శాలువాతో సన్మానించి ప్రసాదాలు అందజేశారు.



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

వన్ స్టాప్ కేంద్రం తనిఖీ

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న దిశా వన్ స్టాప్ సెంటర్, మహిళా ప్రాంగణం (శక్తిసదన్)ను బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి పరిశీలించారు. కార్యాలయానికి సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేసి వాటిని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. సదస్సులో అక్కడ ఉన్న వారికి లీగల్ సర్వీసెస్ యాక్టు 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయంను పొందడానికి అర్హులని తెలిపారు.

బీటీ నాయుడు అను నేను..

(5వ పేజీ తరువాయి)

మర్యాదపూర్వకంగా కలిశారు. శాసన మండలి ఆవరణలో టీడీపీ సీనియర్ నాయకులు కె.ఉమాపతినాయుడు, హాల్వి ఉలిగయ్య, కోసిగి ముత్తురెడ్డి, రామిరెడ్డి తదితరులు బీటీ నాయుడుకు అభినందనలు తెలిపారు.

● **విశ్వసనీయతకు మరో అవకాశం**

ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా 2019 మార్చిలో బీటీ నాయుడుకు టీడీపీ అధినేత చంద్రబాబు తొలిసారిగా అవకాశం ఇచ్చారు. రాయలసీమ జిల్లాల్లో బలమైన వాల్మీకి సామాజికవర్గానికి చెందిన బీటీ నాయుడు 1994లో నాటి ఆదోని ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వం తీసుకున్న బీటీ నాయుడు లా వృత్తికి పూర్తిగా స్వస్తి చెప్పి రాజకీయాల్లో అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ఉమ్మడి రాష్ట్రంలో వివిధ జిల్లాల పరిశీలకుడిగా పని చేయడమే కాక.. 2009, 2014లో రెండు పర్యాయాలు కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అధినేత చంద్రబాబుకు విశ్వసనీయత వల్లే 2019 మార్చిలో తొలిసారిగా శాసనమండలిలో అడుగుపెట్టారు. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు.

కార్యకర్తలను అక్కున చేర్చుకునే పార్టీ: బీటీ నాయుడు, ఎమ్మెల్సీ:

మా అధినేత, సీఎం చంద్రబాబు, యువనేత, మంత్రి నారా లోకేశ్‌లు పని చేసే కార్యకర్తలను అక్కున చేర్చుకుంటారు. రాజకీయంగా మంచి అవకాశాలు ఇస్తారు. అందుకు నేనే ఓ ఉదాహరణ. అత్యంత వెనుకబడిన కోసిగి మండలంలో ఓ మారుమూల గ్రామానికి చెందిన బీసీ సామాజికవర్గానికి చెందిన నాకు రెండో పర్యాయం ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. వారి రుణం ఈ జన్మలో తీర్చుకోలేనిది. టీడీపీ అంటేనే బడుగు బలహీనవర్గాల పార్టీ. పల్లె నుంచి ఢిల్లీ వరకు కష్టపడి పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుంది. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మండలిలో బీసీ, ఎస్సీ ఎస్టీల గొంతుక అవుతాను. రాయలసీమ సమస్యలపై గళం వినిపిస్తా. ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు



ఎమ్మెల్సీ బీటీ నాయుడును అభినందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, విప్ కాలువ శ్రీనివాసులు, తిక్కారెడ్డి తదితరులు



బీటీ నాయుడుతో మంత్రాలయం టీడీపీ నాయకులు

టీసీసీ శిక్షణకు దరఖాస్తులు

- ఏప్రిల్ 25లోపు దరఖాస్తు చేసుకోవాలి : డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) 42 రోజుల కోర్సుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో శామ్యూల్ పాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1 నుంచి జూన్ 11వ తేదీ వరకు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కడప, అనంతపురం జిల్లా కేంద్రాల్లో శిక్షణా తరగతులు కొనసాగుతాయన్నారు. ఏప్రిల్ 25వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి చివరి గడువు అన్నారు. 2025 సంవత్సరం మే నెల ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండి 45 సంవత్సరాలోపు వయసు ఉన్న వారు అర్హులు అన్నారు. పదో తరగతి పాసై టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్ పూర్తి చేసి ఉండాలన్నారు. ఒకేషనల్ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మే ఒకటో తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని డీఈవో వెల్లడించారు.

అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్లు అందజేత


సర్టిఫికెట్లను అందిస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్, ఏఎన్ఎం అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రీబాయి సర్టిఫికెట్లను అందజేశారు. ఏఎన్ఎం కోర్సు తర్వాత ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 1 సంవత్సరం అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన వివిధ కాలేజీలకు చెందిన 40 మంది ఏఎన్ఎంలకు సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు నర్సింగ్ సూపరింటెండెంట్ తెలిపారు. కార్యక్రమంలో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ జి.విమలమ్మ పాల్గొన్నారు.

మత్స్యకారులకు అవగాహన

- మత్స్య శాఖ జేడీ ఏవీ రాఘవరెడ్డి


మాట్లాడుతున్న జేడీ రాఘవరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అలివి వలలు వినియోగించి చేపలు పడితే మత్స్యకారుల లైసెన్స్‌లను రద్దు చేసి చర్యలు తీసుకుంటామని నంద్యాల ఫిషరీష్ జేడీ ఏవీ రాఘవరెడ్డి, నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. నందికొట్కూరులోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. 100 గ్రాముల చేప పిల్లలను కూడా పట్టివేస్తే ఎలా? అని, భవిష్యత్తులో చేపల ఉత్పత్తి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఈ సంవత్సరం దాదాపుగా 17 నుంచి 20 లక్షల చేప పిల్లలను నదిలో వదిలామని తెలిపారు. కృష్ణానది పరివాహక ప్రాంతం లో దాదాపుగా 4 వేల మత్స్యకార కుటుంబాలు చేపల వేటపై ఆధార పడి జీవిస్తున్నాయని చెప్పారు. అందుకే ప్రభుత్వం వారిని దృష్టిలో ఉం చుకొని మత్స్య సంపద అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అయితే కొందరు అలివి వలలు వినియోగించి నష్టం కలిగిస్తు న్నారని చెప్పారు. కార్యక్రమంలో ఫిషరీష్ ఏడీ శ్యామల, ఎఫ్‌డీవో భరత్‌లాల్, డీటీ సత్యనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

పొగాకు దగ్ధం


దగ్ధమైన పొగాకు

బండిఆత్మకూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతజూటూరు గ్రామానికి చెందిన అబ్దుల్లా అనే రైతుకు చెందిన పొగాకు దగ్ధమైంది. కొద్ది రోజులుగా పొగాకు విడిచి షెడ్డులో తోరణాలు కట్టి పొగ కూలీలతో వేయిస్తున్నాడు. అయితే బుధవారం మధ్యాహ్నం షెడ్డులో మంటలు చెలరేగి దిగుబడి మొత్తం బూడిదైపోయింది. నంద్యాల అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరి మంటలను పక్క షెడ్లకు వ్యాపించకుండా పూర్తిగా ఆర్పివేశారు. ఏఎస్ఐ అక్బర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. రూ.6 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

కుందూ నదిలో పడి వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కుందూ నదిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం కోవెలకుంట్ల పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ హనుమంతనాయక్ తెలిపిన వివరాలివీ.. పట్టణంలోని ఎల్ఎం కాంపౌండుకు చెందిన గోగు చెన్నయ్య (52) ఆర్టీసీలో అసిస్టెంటు మెకానిక్‌గా పనిచేస్తుండేవారు. అప్పుడప్పుడూ కుందూనది వద్ద ఉన్న ఆశ్రమానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవారు. అందులో భాగంగా ఆదివారం ఇంటి వద్ద నుంచి బయల్దేరి కుందూనది వద్ద ఉన్న ఆశ్రమం వద్దకు వెళ్లి అక్కడ నుంచి కుందూలో ఈత కొట్టేందుకు దిగి ప్రమాదవశాత్తు పడి చనిపోయారు. బుధవారం మృతదేహం నదిలో కనిపించింది. సీఐ ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. చెన్నయ్య భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కార్లు ఢీ.. ఐదుగురికి గాయాలు


ధ్వంసమైన కార్లు

బేతంచెర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రహదారిలోని బుగ్గానపల్లె రైల్వేస్టేషన్ సమీ పంలో ఎదురెదురుగా వచ్చే రెండు కార్లు బుధవారం సాయంత్రం ఢీకొన్నాయి. ముగ్గురికి తీవ్రగాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలివీ.. పాణ్యం మండలం కందికాయ పల్లె గ్రామం వద్ద జరిగే సోలార్ పనులకు వెళ్లి జాఫర్, జునాద్, షాహీల్ వస్తున్న కారును కర్నూలు వైపు మోహన్, మధు వెళ్తున్న మరో కారు ఢీకొట్టడంతో జాఫర్, జునాద్, మధుకు తీవ్ర గాయాలు కాగా, మోహన్, షాహీల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విహారం.. విషాదం..

- తుంగభద్ర నదిలో తండ్రి, ఇద్దరు కుమారులు మృతి
- సుంకేసులలో దుర్ఘటన


సులేమాన్, ఫర్హాన్ మృతదేహాలు


ఫైజాన్ మృతదేహం

గూడూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరానికి చెందిన ఓ కుటుంబంలో విహారయాత్ర తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రంజాన్ పండుగ ముగిసిన సందర్భంగా విహారయాత్రకు వెళ్లిన కుటుంబంలో అంతులేని విషాదం నెలకొంది. కర్నూలు మండల పరిధిలోని సుంకేసుల డ్యాం వద్ద తుంగభద్ర నదిలో మునిగి సులేమాన్ (47), ఆయన ఇద్దరు కొడుకులు ఫర్హాన్ (13), ఫైజాన్ (9) మృత్యువాత పడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు లక్ష్మినగర్‌కు చెందిన సులేమాన్ రాజ్‌విహార్ సమీపంలో ఓ దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. భార్య నస్రీనా బేగం శకుంతల కల్యాణ మండపం వద్ద మరో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. వీరికి కుమార్తె సోఫియా, ఇద్దరు కొడుకులు ఫర్హాన్, ఫైజాన్‌లు సంతానం. తమకు ఉన్నంతలో ముగ్గురు పిల్లలను ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. సోఫియా పదో తరగతి పరీక్షలు రాసింది. పెద్ద కొడుకు ఫర్హాన్ 7వ తరగతి చదవు తుండగా రెండో కుమారుడు ఫైజాన్ 2వ తరగతి చదువుతున్నాడు. రంజాన్ పర్వదినం ముగియడంతో పాటు మరోవైపు కుమార్తె పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో సులేమాన్, నస్రీన్ బేగం తమ ముగ్గురు పిల్లలతో కలిసి సుంకేసుల డ్యాం వద్దకు విహార యాత్రకు వెళ్లారు. అప్పటికే డ్యాం వద్ద వీరి బంధువులు కూడా ఉన్నారు. అందరు కలిసి ఆనందంగా గడుపుతుండగా.. సులేమాన్ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఈత కొట్టేందుకు సరదాగా నదిలోకి దిగారు. ప్రమాదవశాత్తు నీటిలో వీరు మునిగిపోయారు. లోతును అంచనా వేయకపోవడంతో ముగ్గురూ నీటిలో మునిగిపోయారు. స్థానికులు అప్రమత్తమై వారిని రక్షించేందుకు నదిలోకి దిగినా అప్పటికే వారు నదిలో గల్లంతయ్యారు. గంటపాటు గాలించి తండ్రీ కుమారుల మృతదేహాలను బయటకు తీశారు. సమాచారం తెలుసుకున్న వెంటనే తెలంగాణ రాష్ట్రం రాజోలి పోలీసులు, కర్నూలు జిల్లా గూడూరు మండల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రాజోలి పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. బంధువుల ఫిర్యాదు మేరకు గూడూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఒక్కసారిగా కుటుంబంలో భర్త, ఇద్దరు పిల్లలు చనిపోవడంతో తల్లి నస్రీన్ బేగం రోదనలు మిన్నంటాయి.

కర్నూలు మార్కెట్ కమిటీకి అంచనాకు మించి ఆదాయం

- కందులు, ఉల్లి వాము నుంచి భారీగా సెస్సు వసూలు
- లక్ష్యం రూ.7.60 కోట్లు.. వచ్చింది రూ.8.40 కోట్లు


యార్డుకు పెద్ద మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చిన కందులు

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కువ పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతున్న మార్కెట్ కమిటీల్లో కర్నూలుకు మొదటి స్థానం లభించడంతో పాటు లక్ష్యానికి మించి సెస్సు వసూళ్లు జరిగాయి. మార్చి నెలాఖరుకు కర్నూలు మార్కెట్ కమిటి నుంచి రూ.7.60 కోట్ల సెస్సును సాధించాలని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని మించి రూ.కోటి అదనంగా రూ.8.40 కోట్ల సెస్సును సాధించి కర్నూలు మార్కెట్ కమిటి అధికారులు, సిబ్బంది ప్రభుత్వంతో శభాష్ అనిపించుకున్నారు. సెస్సు ఆదాయాన్ని ఎక్కువ మొత్తంలో రాబట్టేందుకు రైతులు తెచ్చిన కందులతో పాటు వేరుశనగ, వాము, ఉల్లి తదితర పంటలు ఎక్కువ మొత్తంలో రైతులు విక్రయానికి తెచ్చినందువల్లే సాధ్యమైందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. బుధవారం కర్నూలు మార్కెట్ కమిటి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్చి నెలాఖరుకు కర్నూలు మార్కెట్ కమిటి సాధించిన సెస్సు ఆదాయ వివరాలను వివరించారు. వేరుశనగ నుంచి రూ.1.17 కోట్లు, కందుల నుంచి రూ.1.93 కోట్లు, వాము నుంచి రూ.1.19 కోట్లు, ఉల్లి నుంచి రూ.1.61 కోట్లు, ఎండుమిర్చి నుంచి రూ.65 లక్షలు, ఇతర మార్గాల ద్వారా రూ.1.16 కోట్లు మొత్తం రూ.8.40 కోట్లు సెస్సును సాధించామని సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ధాన్యం నుంచి రూ.2 లక్షలు, బియ్యం నుంచి రూ.11 లక్షలు, పొద్దుతిరుగుడు నుంచి రూ.2.77 లక్షలు, పత్తి నుంచి రూ.1.54లక్షలు, శనగల నుంచి రూ.8.15 లక్షలు, ఆముదం నుంచి రూ.35.38 లక్షలు, జొన్నల నుంచి రూ.19వేలు, మొక్కజొన్న నుంచి రూ.6.09 లక్షలు ఆదాయం చేకూరినట్లు తెలిపారు. లక్ష్యానికి మించి ఆదాయాన్ని సాధించడంలో అధికారులు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సెక్రటరీలు ఎంతో శ్రమించారన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నాగేష్, శివన్న, అకౌంటెంట్ కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆదోని బార్ అసోసియేషన్ ఎన్నికలు

- అధ్యక్షుడిగా శ్రీరాములు విజయం, కార్యదర్శిగా జీవన్‌సింగ్


విజేతలు శ్రీరాములు, జీవన్‌సింగ్, వెంకటేశ్వర్లు, రాజారత్నం

ఆదోని, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బార్ అసోసియేషన్ ఎన్నికల్లో న్యాయవాది శ్రీరాములు విజయం సాధించారు. బుధవారం అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికల అధికారి భాస్కర్ రెడ్డి పర్యవేక్షణలో దయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పదవికి మధుసూధన్ రెడ్డి, శ్రీరాములు పోటీపడ్డారు. మొత్తం 303 మంది ఓటర్లు ఉండగా, 292 మంది ఓటు వేశారు. 95 శాతం పోలింగ్ నమోదైంది. గతంలో ఎన్నడూ ఇంత పోలింగ్ శాతం నమోదు కాలేదని న్యాయవాదులు చర్చించుకున్నారు. 6 గంటలకు ఓట్లను లెక్కించారు. శ్రీరాములుకు 192 ఓట్లు రాగా, మధుసూదన్ రెడ్డికి 91 ఓట్లు వచ్చాయి. దీంతో 101 ఓట్లతో శ్రీరాములు అధ్యక్షుడిగా ఘనవిజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవికి 303 మంది సభ్యులకు గానూ, 290 మంది న్యాయవాదులు ఓటు హక్కును వినియోగించుకోగా, 4 ఓట్లు చెల్లలేదు. అనంతరం ఓట్లను లెక్కించారు. జె.వెంకటేశ్వర్లుకు 206 ఓట్లు రాగా, లోకేష్‌కు 80 ఓట్లు వచ్చాయి. 4 ఓట్లు చెల్లలేదు. 126 ఓట్లతో వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షుడిగా విజయం సాధించారు. కార్యదర్శిగా జీవన్‌సింగ్‌కు 197 ఓట్లు రాగా, నెట్టికంఠయ్యకు 88 ఓట్లు రాగా, 5 ఓట్లు చెల్లలేదు. 109 ఓట్లతో కార్యదర్శిగా జీవన్‌సింగ్ ఘనవిజయం సాధించారు. సంయుక్త కార్యదరిగా పోటీపడిన ఖలందర్‌కు 118 ఓట్లు రాగా, రాజారత్నంకు 167 ఓట్లు రాగా, 5 ఓట్లు చెల్లలేదు. 49 ఓట్లతో రాజారత్నం విజయం సాధించారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. విజేతలను న్యాయవాదులు సన్మానించారు. నూతన అధ్యక్షుడు శ్రీరాములు తనను బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్న న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఎన్నికల సహాయ అధికారులుగా భాస్కర్ రెడ్డి, సోమశేఖర్, హనుమేష్ వ్యవహరించారు. టూటౌన్ ఎస్సై రామ్‌నాథ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేకాట స్థావరాలపై దాడులు

- 14 మంది అరెస్టు.. నగదు స్వాధీనం

కోవెలకుంట్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి 14 మందిని అరెస్టు చేసి రూ.48వేలు నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ హనుమంతనాయక్ తెలిపారు. వివరాలివీ.. పట్టణంలో కొందరు వ్యక్తులు పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి ఒకచోట దాడి చేయగా, 9మంది అదుపులోకి తీసుకుని రూ.36వేలు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టణంలో మరో చోట పేకాట స్థావరంపై దాడి చేయగా ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12 వేలు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఉపాధి పనుల్లో అవినీతి

- కల్లూరులో 17వ విడత సామాజిక తనిఖీ
- వైసీపీ ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలు
- రూ.5.8 లక్షల మేర అవినీతి జరిగినట్లు నిర్ధారణ
- రికవరీకి ఉన్నతాధికారుల ఆదేశం


సామాజిక తనిఖీలో పాల్గొన్న డ్వామా పీడీ వెంకటరణయ్య

కల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. డ్వామా పీడీ వెంకటర మణయ్య, ఏపీడీ మాధవీలత, విజిలెన్స్ అధికారులు లోకేష్, ఆదినారాయణ హాజరయ్యారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలో గుర్తించిన అక్రమాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధిహామీ పథకం పనులకు చెందిన రూ. 7.47 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన రూ. 3.10 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో చేపట్టిన రూ. 63.17 లక్షల పనులపై డ్వామా పీడీ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో ఉపాధిహామీ సిబ్బందితో చర్చించారు. అందులో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో కలిపి బినామీ పేర్ల నమోదు, కొలతల్లో తేడాలపై రూ.5.39 లక్షల మేర రికవరీకి డ్వామా పీడీ ఆదేశించారు. అలాగే రూ.41 వేలు జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారెవరైనా ఉపేక్షించబోమని పీడీ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.నాగేశ్వరచలరెడ్డి, పీఆర్ ఏఈ అచ్యుతానందరెడ్డి, ఎస్ఆర్‌పీ విజయభాస్కర్, ఏపీవో మద్దేశ్వరమ్మ, ఎఫ్ఏలు, టీఏలు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమాలు

గత వైసీపీ ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్దఎత్తున అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈమేరకు డ్వామా పీడీకి ఆయా గ్రామాల నాయకులు ప్రజలు ఫీల్డ్ అసిస్టెంట్ల అవినీతి అక్రమాలపై వినతిపత్రాలు అందించారు. బస్తిపాడు, నాయకల్లు, కొంగనపాడు, సల్కాపురం, పెద్దకొట్టాల గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లపై ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేపట్టి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన మండల, జిల్లా ఉన్నతాధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవడంలో విఫలం అయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఐదు గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు విధులకు రాజీనామా చేయగా వాటిని మండలం ఎంపీడీవో, డ్వామా అధికారులు తొలగించినట్లు సమాచారం. అవినీతి అక్రమాలకు పాల్పడిన ఫీల్ అసిస్టెంట్లపై ఎలాంటి చర్యలు లేకుండానే వైదొలిగారు. అందులో అధికారుల పాత్ర ఏమిటనేది ప్రశ్నగా మిగిలిపోయింది. అదేవిధంగా ఎ.గోకులపాడు, ఉలిందకొండ ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని గ్రామ ప్రజలు డ్వామా పీడీకి ఫిర్యాదు చేశారు.

ఉలిందకొండ ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొనసాగించాలి: సీపీఎం

గత 15 సంవత్సరాలుగా ఉపాధిహామీ పనులను లక్ష్యం మేరకు నిర్వహిస్తూ విధులు చేపడుతున్న ఉలిందకొండ ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.శాంతకుమారిని కొనసాగించాలని సీపీఎం మండల కార్యదర్శి కృష్ణ, మధు డిమాండ్ చేశారు. ఆమె ఎలాంటి ఆరోపణలు లేకపోయినా నాయకుల మెప్పుకోసం తొలగిస్తే చూస్తూ ఊరుకోబోమని అన్నారు.

గాంధీనగర్‌లో చైన్ స్నాచింగ్..

- వృద్ధురాలి మెడలో బలవంతంగా బంగారు గొలుసును లాక్కెళ్లిన దుండగుడు
- పారిపోతూ కిందపడిన దుండగుడు
- చికిత్స పొందుతూ మృతి



దొంగతనం జరిగిన ప్రాంతం, ఇన్‌సెట్‌లో బాధితురాలు

ఎమ్మిగనూరు , ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో జరిగిన చైన్ స్నాచింగ్ కలకలంరేపింది. వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడి కథ విషాదంగా ముగిసింది. పట్టణానికి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి బస్టాండ్ ప్రాంతంలో బార్‌బార్ షాపులో పనిచేస్తున్నాడు. గాంధీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో మొదటి అంతస్తులో తనకు పరిచయం ఉన్న వృద్ధదంపతులు ఇంటిలోకి తెల్లవారుజామునే వెళ్లాడు. వృద్ధురాలు రమణమ్మ తెల్లవారు జామున బాత్‌రూంలో నుంచి బయటకు వస్తుండగా ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొన్ని ఒక్కసారిగా ఆమెను బలంగా నెట్టివేశాడు. ఈ క్రమంలో బాధితురాలు రమణమ్మకు ముఖంపైన, చేతులు, కాలికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో బాధిత వృద్ధురాలు కిందపడి గట్టిగా కేకలు వేసింది. బంగారు గొలుసును లాక్కొన్ని పారిపోయే క్రమంలో దుండగుడు రాఘవేంద్ర పై అంతస్తు నుంచి కిందకు పడిపోయాడు. బాధితురాలి బంధువులు, పోలీసు లకు సమాచారం అందిండంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అలాగే దుండగుడు రాఘవేంద్ర బంధు వులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్ర గాయాల పాలైన రాఘవేంద్రను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని తిరిగి ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీఎల్‌వోలు నిబద్ధతతో పని చేయాలి

కర్నూలు అసెంబ్లీ ఆర్ఓ ఎస్.రవీంద్రబాబు



మాట్లాడుతున్న ఆర్ఓ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో నిబద్ధతతో పని చేయాలని కర్నూలు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు బీఎల్ఓలకు సూచించారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీ సమావేశ భవనంలో బీఎల్ఓలకు వార్షిక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ ఫారం 6,7,8 లను నింపటంపై పూర్తి అవగాహనతో ఉండాలని, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు అవసరమనుకుంటే తమ దృష్టికి తీసుకురావా లన్నారు. హ్యాండ్‌బుక్‌ను చదివి ఎన్నికల విధులు, నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దారు వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు మంజూరు బాషా, క్రిష్టఫర్, డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, ఆర్ఐలు భార్గవ్, రాజు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించండి

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని శరీన్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. ముందుగా ఓపీ, వ్యాక్సిన్, మందుల గదులను తనిఖీ చేశారు. రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఓపీ సేవలకు ప్రతి రోజు వేయి మంది వస్తున్నారని, ఆ వివరాలను డాక్టర కేర్ పోర్టల్‌లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో అప్‌లోడు చేయాలని ఆదేశించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఓఆర్ఎస్ కార్నర్‌ను పరిశీలించారు. ఓఆర్ఎస్ ద్రావణం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం శరీన్‌నగర్ పరిధిలోని 71వ సచివాల యంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని డీఎంహె చ్‌వో తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ ఉమా, వైద్యాధికారి పర్వీన్ తబస్సుం, డీపీవో విజయ రాజు, డెమో శ్రీని వాసుల శెట్టి పాల్గొన్నారు.

'పంచాయతీ కార్యదర్శిపై కేసు అన్యాయం'

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తెర్నెకల్లులో సంబంధం లేని అంశంలో పంచాయతీ కార్యదర్శి రాముడిపై కేసు నమోదు చేయడం అన్యాయమని నవీన పంచాయతీ కార్యదర్శుల సంఘం కన్వీనర్ గిరి శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ సభ నిర్వహణ అనంత రం షామీయానా తొలగిస్తూ విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందారన్నారు. అయితే ఆ సంఘటనతో సంబంధం లేని రాముడును బాధ్యుడని చేసి కేసు నమోదు చేయడం దారుణమన్నారు.

గోకులం షెడ్డు నిర్మాణాల పరిశీలన

సి.బెళగల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు, ముడుమాల, సి.బెళగల్ గ్రామాల్లో నిర్మిస్తున్న గోకుల షెడ్డు నిర్మాణాలను ఎంపీడీవో రాణెమ్మ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గోకుల షెడ్డు నిర్మాణాలపై నిర్లక్ష్యం వహించొద్దని అన్నారు. అలాగే గ్రామాలలో జాబుకార్డు ఉన్నవారంతా ఉపాధి పనులను వినియోగించుకోవాలన్నారు. ఎంపీడీవో వెంట పంచాయతీ రాజ్ ఏఈ వెంకట్ ప్రకాశ్, ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి ఉన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

సి.బెళగల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పోలకల్లు గ్రామాల్లోని ఉపాధి పనులను ఎంపీడీవో రాణెమ్మ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల నేపథ్యంలో ఉపాధి కూలీలు త్వరగా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ఉపాధి పనులకు హాజరైన కూలీలకు మాత్రమే మస్టర్‌లో హాజరు వేయాలన్నారు. గ్రామాలలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్‌ల దగ్గర మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు ఆదేశించారు. ఎంపీడీవో వెంట ఏపీవో రామన్న, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సర్వేకు ప్రజలకు సహకరించాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోం సర్వేకు నగర ప్రజలకు సహకరించాలని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో 18 నుంచి 50 ఏళ్లలోపు 2.73 లక్షల మంది పౌరులను సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని, ఇప్పటికి 1.73 లక్షల మందికి సర్వే పూర్తి చేశామన్నారు. మిగిలిన లక్ష మందికి సర్వే చేపడతామన్నారు. ఉద్యోగులు వర్క్ ఫ్రం హోం చేస్తున్నవారి వివరాలతోపాటుగా వారి అభిప్రాయాలనను సచివాలయ సిబ్బందికి చెప్పాలన్నారు.

దివ్యాంగులకు పింఛన్ మంజూరు చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులందరికీ రూ.15 వేల పింఛన్ మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండి. ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డయాలసిస్ పెషెంట్లకు రూ.15 వేల పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్న ప్రభుత్వాలు దివ్యాంగులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

● కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు నరసింహులు డిమాండ్ చేశారు. శ్రీరామ్‌నగర్ చైతన్య పాఠశాల వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. నాయకులు అజ్మత్, మహేశ్వరమ్మ, కీర్తన పాల్గొన్నారు.

● సమసమాజ స్థాపనే సీపీఎం లక్ష్యమని నగర కార్యదర్శి టి.రాముడు అన్నారు. పార్టీ జాతీయ 24వ మహాసభ తమిళనాడులో ప్రారంభం సందర్భంగా జాతీయ మహసభలు జయప్రదం చేయాలని కోరుతూ సుందరయ్య కూడలిలో సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఎస్. రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్రెవుల గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్ అన్నారు. బుధవారం గుండ్రేవుల గ్రామం పక్కన ఉన్న తుంగభద్ర నదిలో నీటిని ఆయన పరిశీలించారు.

స్టాఫ్ లేదట..!

● నిర్దాక్షిణ్యంగా బస్సులోంచి దింపేస్తున్న ఆర్టీసీ సిబ్బంది
● డ్రైవర్, కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రయాణికుల డిమాండ్
● ఆర్టీసీ ఆర్ఎంకు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు

కోడుమూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కోడుమూరు ప్రయాణికుపై ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపారం నిమిత్తం కోడుమూరు నుంచి ప్రయాణికులు ఎమ్మిగనూరు, ఆదోని, బళ్ళారితోపాటు కర్నూలుకు వందలాది మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తారు. అయితే కండక్టర్, డ్రైవర్ విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతు న్నారు. కోడుమూరులో ఆర్టీసీ బస్సులను నిలపడం లేదు. దీంతో సమయానికి గమ్యానికి చేరుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. కండక్టర్, డ్రైవర్లు కోడుమూరు ప్రయాణికులంటే చిన్న చూపు చూస్తు న్నారని బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. కోడుమూరుకు స్టాఫ్ లేదంటూ ప్రయాణికులను అవమాన పరుస్తూ నిర్దాక్షిణ్యంగా బస్సులోంచి కిందికి దింపివేస్తున్నారు. ఇదే మిటని ప్రశ్నిస్తే మా ఇష్టం కండెక్టర్, డ్రైవర్లు ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. దీంతో ఏమి చేయాలో అర్థంకాక ప్రయాణికులు అవమానంతో కిందికి దిగిపోతున్నారు. ప్రయాణికుల డబ్బుతో జీతాలు తీసుకుంటున్న ఆర్టీసీ డ్రైవర్, కండక్టకు కోడుమూరు ప్రయాణికులంటే ఎందుకు ఇంత నిర్లక్ష్యం. నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులో స్టాఫ్ లేదంటూ ఖాళీ సీట్లతో కోడుమూరు మీదుగా ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు వైపుగా వెళ్తున్నా ప్రజా ప్రతినిధులు ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు : కోడుమూరు ప్రయాణికులపై దురుసుగా వ్యవహరించిన డ్రైవర్, కండెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు టీడీపీ నాయకులు గోపాల్‌నాయుడు, ఏ.రాముడు బుధవారం ఫిర్యాదు చేశారు. టికెట్లు కొట్టలేక కొంత మంది డ్రైవర్లు, కండక్టర్లు కోడుమూరులో స్టాప్ లేదంటూ ఆర్టీసీ బస్సులను నిలపడం లేదని, బస్సులో ఎక్కిన కోడుమూరులో ఆగదు అంటూ దింపివేస్తున్నారని, వారిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, ప్రతి ఆర్టీసీ బస్సు కోడుమూరులో నిలపాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

కోడుమూరుకు స్టాఫ్ లేదంటూ దింపేశారు



కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం సుమారు మధ్యాహ్నం 4 గంటల సమయంలో కర్నూలు 2 డిపో చెందిన ఎమ్మిగనూరుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కాను. కోడుమూరు అనగానే మహిళా కండక్టర్, డ్రైవర్ కేవలం ఎమ్మిగనూరుకు మాత్రమే ఆగుతుంది అన్నారు. ఇదే మిటంటే ప్రశ్నిస్తే.. చెవిటే వినపడదా అంటూ డ్రైవర్, కండెక్టర్ నాపై కేకలు వేశారు. దీంతో బస్సు దిగి పక్కన ఉన్న ఎమ్మిగనూరు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఎక్కాను. రూ.70 టిక్కెట్టు తీసుకొని కోడుమూరులో దిగాల్సి వచ్చింది. సూపర్ లగ్జరీ బస్సు కోడుమూ రులో ఆగింది. కర్నూలు 2 డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు ఎందుకు ఆపడం లేదు.

- చాంద్, కోడుమూరు

వృద్ధులపై దురుసుగా వ్యవహరించారు



కర్నూలు 2 డిపోకు చెందిన (ఏపీ21జెడ్ 0748) బస్సులో ఎక్కాను. మొదట బస్సు నిండిపోయి ప్రయాణికులు నిల్చున్నారు. ఎమ్మిగ నూరులో మాత్రమే ఆగుతుందని కోడుమూరు, గోనెగండ్ల ప్రయాణికులు కండక్టర్, డ్రైవర్ చెప్పడంతో అందరు దిగిపోయారు. దాదాపు 20 మంది కోడుమూరు ప్రయాణికులు బస్సులోంచి దిగిపో యారు. కానీ నేను దిగలేదు. ప్రయాణికులు కోడుమూరు ఆగుతుం దా చాలా మంది ఆడిగారు. ఇందుకు కండెక్టర్, డ్రైవర్ ప్రయాణి కులతో దురుసుగా మాట్లాడారు. చివరకు వృద్ధులపై కూడా దురుసుగా మాట్లాడటం బాధ అనిపించింది. ఇలాంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- సుభాషిని, కోడుమూరు

ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకెళ్తాం

ప్రయాణికులను బస్సులో ఎక్కించుకోకుండా ఆర్టీసీకి డ్రైవ ర్లు, కండక్టర్లు నష్టం తీసుకొస్తున్నారన్న విషయం ఎండీ దృష్టికి తీసుకెళ్తాం. కోడుమూరు ప్రయాణికులతోనే ఆర్టీసీకి ఎంతో ఆదాయం ఉంది. బస్సులు ఆపకపోవడంతో ఆటోలు, ప్రైవేటు వాహనాలను ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. ఈవిషయం ప్రభు త్వం దృష్టికి కూడా తీసుకెళ్తాం.

- రాముడు, టీడీపీ, కోడుమూరు

రైతు సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రామచంద్రయ్య

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో ఈనెల 4న కర్నూలులో జరిగే జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15, 16, 17 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలో ఆల్ ఇండియా కిసాన్ జాతీయ మహాసభలు జరుగుతాయన్నారు. ఇప్పటికే దేశంలో వ్యవసాయం సంక్షోభంలో పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో వైఫల్యం చెందాయని విమర్శించారు. ఈ సదస్సుకు కేరళ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి రఘువీరారెడ్డి, కిసాన్ సభ జాతీయ కార్యదర్శి రావుల వెంకయ్య హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు ప్రసన్నకుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సారధి పటేల్, లక్ష్మి, గిరిజారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్మకారులను పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న జె మోహన్

గూడూరు ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చర్మకారుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రేపల్లె పెద్దబాబు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో చర్మకార వృతిదారుల జనరల్ బాడీ సమావేశం కేవీపీఎస్ పట్టణ నాయకుడు దానమన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పెద్దబాబు, చర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఆంటోని, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ మాట్లాడుతూ చర్మకార వృత్తిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని, ఇంటి స్థలం, రెండు ఎకరాల పొలం, ఆరోగ్య బీమా, పెన్షన్ అందిం చాలని డిమాండ్ చేశారు. అనంతరం గూడూరు పట్టణ చర్మకార వృత్తిదారుల సంఘం కమిటీని ఎన్నుకున్నారు.

12 గంటల నిర్విరామ సుందరకాండ పారాయణం

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్‌లోని భక్త ఆంజనేయస్వామి-షిరిడీ సాయిబాబా దేవస్థానంలో బుధవారం 12 గంటల పాటు నిర్విరామ సుందరకాండ పారాయణం నిర్వహించారు. కోడుమూరు మండలం అమడగుంట గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక ప్రవచన కర్త గడిగే కృష్ణ ఈ పారాయణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం 6 గంటల ప్రారంభించిన ఈ పారాయ ణం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గడిగే కృష్ణను శాలువతో ఘనంగా సత్కరించారు. రానున్న శ్రీరామనవమి వేడుకను పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టినట్లు గడిగే కృష్ణ పేర్కొన్నారు.



గడిగే కృష్ణను సత్కరిస్తున్న అర్చకుడు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన గౌరు దంపతులు

కల్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్లూరు అర్బన్ 16 వార్డుల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు గౌరు దంప తులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 195 అర్జీలు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోనే కార్యకర్తలకు భరోసా: తెలుగుదేశం పార్టీలోనే నాయకులు, కార్యకర్తలకు భరోసా ఉందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం కల్లూరు, ఓర్వకల్లు మండల బూత్, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలతో గౌరు దంపతులు సమావేశం నిర్వ హించారు. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పాణ్యం నియోజకవర్గంలో సభ్యత్వ నమోదును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికి ఇంకా సభ్యత్వ నమోదుకు అవకాశం ఉన్నచోట కార్యకర్తలు చురుకుగా పాల్గొని సభ్యత్వ నమోదు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్డులను క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలకు అందజేశారు. కార్యక్రమంలో డి.రామాంజనేయులు, ఈవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లపరిలో వైభవంగా దేవర



బోనాలతో ఆలయానికి తరలి వెళ్తున్న మహిళలు

కోడుమూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లపరిలో బుధవారం గ్రామదేవతలు మారెమ్మ, దుర్గమ్మ అమ్మవార్లకు దేవరను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు మోస్తూ డప్పువాయిద్యాల నడుమ ఆలయాలకు చేరుకున్నారు. అమ్మవార్లకు పూలు, పసుపు, కుంకుమ, గాజులు, సారె, నైవేద్యం సమర్పించారు. టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మూగ జీవాల కోసమే నీటితొట్లు

తెలుగు యువత మండల అధ్యక్షుడు సుమన్ బాబు

గూడూరు ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మూగజీవాల దాహం తీర్చేందుకు నీటితొట్లు నిర్మిస్తున్నామని తెలుగు యువత మండల అధ్యక్షుడు సుమన్ బాబు అన్నారు. బుధవారం గూడూరు మండలం ఆర్ ఖానాపురం గ్రామంలో నీటి తొట్టి నిర్మాణానికి సుమన్ బాబు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా మూగజీవాలకు నీటిని అందించే ందుకు నీటితొట్టి నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిస్వామి, టీడీపీ నాయకులు ఎల్లప్ప, హనుమంతు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరిశోధన ప్రాముఖ్యతపై అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఉపకులపతి వి.ఉమా

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీలో పరిశోధన ప్రాముఖ్యతపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి ఉపకులపతి వి.ఉమా మాట్లాడుతూ సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి కొత్త కోర్సులు అవసరమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్స్ వీవీఎస్ కుమార్, ఇందిరా శాంతి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఓర్వకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు గ్రామంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో చలివేంద్రాన్ని ఎంపీడీవో శ్రీనివాసులు బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడుతాయన్నారు. బస్టాండు, ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దాతలు, యువత ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో

అలంకారప్రాయంగా నీటితొట్లు

● చుక్కనీరు ఉంటే ఒట్టు
● దాహంతో తల్లడిల్లుతున్న మూగజీవాలు

ఓర్వకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మూగజీవుల దాహం తీర్చేందుకు వేలాది రూపాయలు ఖర్చుచేసి నిర్మించిన పశువుల నీటి తొట్లు అలంకార ప్రాయంగా మారాయి. ప్రభుత్వం మూగజీవుల దాహం తీర్చేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా నీటి తొట్లు నిర్మించారు. అయితే గత కొన్నేళ్లుగా నీటి తొట్లు నిరుపయోగంగా మారినా గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, నన్నూరు, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, శకునాల, తిప్పాయపల్లె, తదితర గ్రామాల్లో 25 నీటి తొట్లు ఉన్నాయి. వాటి నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా గత టీడీపీ ప్రభుత్వంలో రూ.5 లక్షలతో నిర్మించింది. గత వైసీపీ ప్రభుత్వం కూడా ఈ నీటి తొట్ల గురించి పట్టించుకున్న దాఖలాలే లేవు. నీటి తొట్లలో చుక్కనీరు లేక మూగజీవాలు అక్కడికి వెళ్లి తిరిగి వెనక్కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండలు తీవ్రరూపం దాల్చుతుండటంతో పశువులు దాహంతో అల్లాడుతున్నాయి. నీటితో కళకళలాడాల్సిన తొట్లు ఒట్టిపోయి దర్శనమిస్తున్నాయి. ఒక్కో తొట్టి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.30 వేలు కేటాయించింది. నీటి తొట్లు ఉపయోగం లేనందున గోడలు బీటలు మారుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామ స్థులు ఆరోపిస్తున్నారు. వేలాది రూపాయలతో నిర్మించిన తొట్లకు గ్రామ పంచాయతీ అధికారులు పైపు లైన్ కలెక్షన్ ఇచ్చి వాటిలో నీటిని నింపి మూగజీవాల దాహం తీర్చాల్సి ఉండగా మండలంలో ఏ ఒక్క నీటి తొట్టిలో నీరు నిల్వ ఉండటం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న నీటితొట్టిలో నీటి నిల్వ ఉంచి మూగజీవాల దాహం తీర్చాలని కోరుతున్నారు.



ఓర్వకల్లులో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

నీటి తొట్టి ఉన్నా ప్రయోజనం శూన్యం



గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మూగ జీవాల దాహం తీర్చేందుకు ప్రభుత్వం నీటి తొట్లు నిర్మించినా వాటి వలన ప్రయోజనం లేదు. ఏ ఒక్క నీటి తొట్టిలో నీరు నిల్వ ఉండక పోవడంతో మూగజీవాలు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నాయి. అధికారులు స్పందించి నీటి తొట్టిలో నీటిని నింపాలి.

- రామకృష్ణ, సీపీఎం నాయకుడు

మూగజీవాల దాహం తీరుస్తాం



గతంలోనే మండలంలో 25 నీటి తొట్లు నిర్మించారు. వీటిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో చర్చించి నీటి తొట్టిలో నీటిని నింపి మూగజీవాల దాహం తీరుస్తాం. అలాగే నీటి తొట్టిలో అక్కడక్కడ సిమెంటు పగుళ్లు ఇచ్చిందని, మరమ్మతులు చేయించి నీటిని నింపి మూగజీవాల దాహం తీరుస్తాం.

- కుమారసాయినాథ్, ఏపీవో, ఓర్వకల్లు

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైష్ణవి డిగ్రీ కళాశాలలో పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడు పవన్ కళ్యాణ్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ ప్రతి గురువారం ఉదయం 9 గంటలకు తరగతులు ప్రారంభమవుతాయనీ, మెటీరియల్ కూడా ఉచితంగా ఇస్తామ న్నారు. వివరాలకు 6301641351, 8993695142 నబర్లలలో సంప్రదించాలన్నారు.

మద్దికెర: స్థానిక కొత్తపల్లి రోడ్డులోని వశిష్ట పాఠశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆపద్బంధవ సేవా సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్, కరస్పాండెంట్ కోలి ఫక్కీరప్ప తెలిపారు. బుధవారం మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉటుందన్నారు. వివరాలకు 8247452174, 8919887832 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వీవోఏలు బాధ్యతగా పని చేయాలి


సమావేశంలో పాల్గొన్న వీవోఏలు

దేవనకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వీవోఏలు బాధ్యతతో పని చేయాలని డీఆర్‌డీఏ పీడీ వైవి రమణారెడ్డి సూచించారు. బుధవారం వెలుగు కార్యాలయంలో శిక్షణ నిర్వహిం చారు. ఆరు సంఘాలకు ఒకరి ప్రకారం నియమించి, మహిళల జీవనోపాధి, కుటుంబ ఆర్థిక అవసరాల ను సెర్ప్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏపీఎం నరసన్న, సీసీ మస్తాన్, ముద్దరంగడు, ప్రభాకర్, స్వామన్న, ఏసీ శివ పాల్గొన్నారు.

యాప్‌ల భారం తగ్గించండి


సీడీపీవోకు వినతి పత్రం ఇస్తున్న అంగన్వాడీలు

వెల్దుర్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తమకు యాప్‌ల పనిభారం తగ్గించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు చాందిని కోరారు. బుధవారం వెల్దుర్తి ఐసీడీఎస్ కార్యాలయంలో క్రిష్ణగిరి, వెల్దుర్తి అంగన్వాడీల నాయకులతో కలిసి సీడీపీవో లూక్‌కు వినతి పత్రం అందజేశారు. పనిభారం పెంచారని, వేతనాలు కూడా పెంచాలని డిమాండ్ చేశారు. సుజాత, సంధ్యారాణి, ఈదమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి


కాశమ్మ (ఫైల్)

దేవనకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసిన పి. కాశమ్మ(46) చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన మేరకు.. మండలంలోని వెలమకూరు గ్రామానికి చెందిన కాశమ్మ మూడు సంవత్సరాల నుంచి కడుపునొప్పితో బాధపడతోంది. ఆనారోగ్యంతో పాటు, ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. అయితే మెరుగైన వైద్యంకోసం తరలించారు. కోలుకోలేక మంగళవారం రాత్రి ఆస్పత్రిలో మృతిచెందింది. మృతురాలుకి భర్త కాశీమప్ప, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పురుషోత్తం చౌదరి

మద్దికెర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుడు సి.రంగస్వామి పదవీ విరమణ పొందడంతో మాజీ జడ్పీటీసీ సభ్యుడు పి.పురుషోత్తం చౌదరి సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తి విలువైనదని, ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయులను గౌరవించాలన్నారు. బురుజుల శ్రీనివాసులు, విద్యాకమిటి ఛైర్మన్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

టెక్నాలజీ వినియోగం తప్పనిసరి

ఆదోని టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజం టెక్నాలజీతో ముడిపడి ఉందని కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ అన్నారు. బుధవారం అమరావతి నగర్‌లో రోబోటిక్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. రోబోటిక్ ఎగ్జిబిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. మహబూబ్ బాషా, యూసీ మనిస్వామి, నబీ సాబ్, ఉరుకుందప్ప, శ్రీరాములు, ఈరన్న, నాగేష్, వెల్లాల మధుసూదన శర్మ, నిర్వాహకులు సురేష్, గోపాల్, రమేష్ పాల్గొన్నారు.

నీటి వాటా కోసం ఘర్షణ

ఆదోని రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద హరివాణంలో ఘర్షణ చోటు చేసుకుంది. పొలాల్లో ఎల్లెల్సీ సాగు నీటి వాటా విషయంలో బీజేపీ నాయకుడు పాండు, టీడీపీ నాయకులు చిన్న ఉసేని, లోకేష్ మధ్య బుధవారం వాగ్వాదం చోటుచేసుకుని, ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు కట్టెలతో దాడి చేసుకుని, పిడుగుద్దులు గుద్దుకున్నారు. ఇరు వర్గాల నాయకులు గాయపడగా, బీజేపీ నాయకుడు పాండు ఏరియా ఆసుపత్రిలో చేరారు. కేసును విచారిస్తున్నట్లు ఇస్వీ ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

సారా బట్టీలు ధ్వంసం

తుగ్గలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపల్లి గ్రామ శివారులో సారా స్థావరాలపై దాడులు చేసి బెల్లం ఊట, సారాను ధ్వంసం చేసినట్లు ఎస్‌ఐ క్రిష్ణమూర్తి బుధవారం తెలిపారు. సారా అమ్మినా, తయారు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సారా తయారీపై సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

వెలుగు యానిమేటర్లకు శిక్షణ

వెల్దుర్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో పీడీ రమణారెడ్డి బుధవారం యానిమేటర్లకు శిక్షణ ఇచ్చారు. జీవనోపాధి, కుటుంబ అవసరాల ప్రణాళికను తయారు చేయుటను గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రత్యేక పర్యవేక్షణ అధికారి అనురాధ, ఏపీఎం అనురాధ, చంద్రశేఖర్, శాంతకుమారి పాల్గొన్నారు.

మురుగు పారక..

- ఆలూరులో అడుగడుగునా అపరిశుభ్రత
- దుర్వాసనతో కాలనీవాసుల అవస్థ


ఆలూరు కోటవీధి మెయిన్ రోడ్డులో కాలువ దుస్థితి

ఆలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరుగడ్డ సమీపంలో, కోటవీధి మెయిన్ రోడ్డులోని కాలువల్లో పూడిక తీయకపోవడంతో కంపు కొడుతోంది. తీవ్ర దుర్వాసన, దోమలతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుధ్య పనులు చేయాల్సిన పంచాయతీ అధికారులు పత్తా లేని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మురుగును శివాలయం వెనుక నుంచి శివారులోకి మళ్లిస్తే సమస్య పరిష్కారం అవుతుందని ప్రజలు అంటున్నారు.

దుర్వాసనతో ఇబ్బందులు

మురుగుతో దోమలు, ఈగలు, వ్యాప్తి చెంది అనారోగ్యం పాలవుతున్నాం. పిల్లలు జ్వరాలు, వాంతుల భారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు పారిశుధ్య పనులు చేయించాలి. - **నాగవేణి, కాలనీ వాసి**



సూచికలు లేని బోర్డులు?


కోగిలతోట గ్రామ శివారులో మలుపు వద్ద సూచిక లేదు

హొళగుంద, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి ముద్దటామాది, కొగిలతోట, సమ్మతగేరి గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రమాద సూచికలు కనిపించకుండా పోయాయి. ఈ రహదారిపై అడుగడుగునా మలుపుల ఉన్నాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయని ప్రమాద సూచికలు లేకపోవటంతో వాహనదారులు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ సాయి సురేష్‌ను వివరణ కోరగా ప్రమాదాలు నివారించే బోర్డులకు నిధులు లేవని, జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్
- ఆలూరులో ప్రజా పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ


వీరభద్రగౌడ్‌కు వినతిపత్రం ఇస్తున్న దేవనకొండ నాయకులు

ఆలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 2018లో గ్రీన్ పార్కుకు 1.50 ఎకరాలు కేటాయించగా, రూ.2 లక్షలతో ముళ్ళ కంప కూడా తొలగించారని వైసీపీ ప్రభుత్వం దాన్ని పక్కన పెట్టిందని పార్కు ఏర్పాటు చేయాలని ప్రజలు వినతిపత్రం అందించారు. అలాగే కురువల్లి- అరికెర గ్రామానికి రహదారి నిర్మించాలని గ్రామాల ప్రజలు విన్నవించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి సంబంధిత శాఖలకు పంపి పరిష్కారమయ్యేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. కన్వీనర్లు అశోక్, సుధాకర్, డా తిప్పయ్య, ఏబీసీ కెనాల్ డీసీ చైర్మన్ నగర డోన కిష్టప్ప, రఘు ప్రసాద్ రెడ్డి, గిరి మల్లేష్ గౌడ్, అట్టేకల్ బాబు, నరసప్ప, తిమ్మయ్య, కొమ్ము రామాంజినేయులు, సాలీ సాహెబ్, కృష్ణం నాయుడు, కొమ్ము రాజు, మసాలా జగన్ పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

దేవనకొండ: దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలని మండల టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, వీరేష్ కోరారు. బుధవారం ఆలూరులో జరిగిన టీడీపీ గ్రీవెన్స్‌లో పార్ట ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ ఏడాది పంటలు సరిగా పండలేదని, రైతులు అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు వెంకటస్వామిగౌడ్, రామాంజినేయులు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు డీఎస్పీ సన్మానం


శ్రీనాథ్‌ను సన్మానిస్తున్న ఆదోని డీఎస్పీ హేమలత

ఆదోని టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలతో గుర్తింపు పొంది బంగారు నంది అవార్డును అందుకొన్న పట్టణానికి చెందిన వంకదారు శ్రీనాథ్ గుప్తాను డీఎస్పీ హేమలత బుధవారం సన్మానించారు. ఆవోపా తరపున సేవా కార్యక్రమాలు చేసినందుకు మెగా హెల్ప్ ఫౌండేషన్ (హైదరాబాద్) సామాజిక సేవా విభాగం కింద ఈ అవార్డు అందజేసింది. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల ప్రజలకు సేవా కార్యక్రమాలు అందించాలని సూచించారు. శ్రీనాథ్ గుప్తా తనకు సహకరించిన ఆవోపా సభ్యులు, సౌజన్యకర్తగా వ్యవహరించిన కాకుబాల్ నాగేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జొన్నగిరి ఎస్‌ఐగా మల్లికార్జున



తుగ్గలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా ఎస్‌సీ మల్లికార్జున బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న జయశేఖర్‌గౌడ్ ఆదోనికి బదిలీ అయ్యారు. ఎస్‌బీలో పని చేస్తున్న మల్లికార్జున బదిలీపై వచ్చారు. టీడీపీ నాయకులు బాలన్న, మిద్దెరవికుమార్, లక్ష్మణస్వామి, సర్పంచ్ ఓబులేసు, సంగాల క్రిష్ణ ఎస్‌ఐని కలిసి సన్మానం చేశారు.

కరువు మండలాలుగా గుర్తించాలి


డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న మునిస్వామి

ఆలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకుడు బోయ మునిస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మకు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఆలూరు చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద, దేవనకొండ మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, వర్షాలు లేక పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పత్తి, మిర్చి, మొక్కజొన్న, పొగాకు, కందులు, టమోటా, వేరుశనగతో రైతులు తీవ్రంగా నష్టపోయాయన్నారు.

రైతు సమస్యలపై పోరాడతాం

తుగ్గలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై తాము పోరాడతామని సీపీఐ తాలుకా రైతు సంఘం అధ్యక్షుడు ఉమాపతి అన్నారు. బుధవారం మండలంలోని తుగ్గలి, ఇతర గ్రామాల్లో జీపుజాత నిర్వహించారు. రైతులు రైతుభరోసా అందక ఇబ్బందులు పడుతున్నారనీ, రైతుల సమస్యలు తెలుసుకునేందుకే జీపుజాత నిర్వహిస్తున్నామ న్నారు.

కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన కల్పన


కార్యదర్శి కల్పనకు బొకే ఇస్తున్న మార్కెట్ యార్డ్ సిబ్బంది

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డ్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా కల్పన బాధ్యతలు బుధవారం చేపట్టారు. రెండు రోజుల క్రితం కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి పదవీ విరమణ చేయడంతో నంద్యాలలో పనిచేస్తున్న కల్పనకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ కడప రీజినల్ మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజినేయులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను సహాయ కార్యదర్శి శాంత కుమార్ సూపర్వైజర్లు మోహన్ రెడ్డి, రాము, నాగరాజు, అశోక్ కుమార్, శ్రీనివాసులు, రామాంజనేయులు అభినందనలు తెలిపారు. కల్పన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి

మద్దికెర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు వడదెబ్బ తగలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి సూచించారు. బుధవారం మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు తరుచూ నీటిని తాగించాలని తెలిపారు.

ఐఆర్ ప్రకటించాలి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ కన్వీనర్ వీరభద్ర యాదవ్ ప్రకటనలో డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ వేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సోము వీర్రాజుకు అభినందనలు


సోమువీర్రాజును అభినందిస్తున్న కునిగిరి నీలకంఠ

ఆదోని టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా రెండో పర్యాయం ప్రమాణం చేసిన సోమువీర్రాజును బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అభినందించారు. బుధవారం అనుచరులతో పాటు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసినట్లు తెలిపారు.

తుగ్గలిని కరువు మండలంగా ప్రకటించాలి

తుగ్గలి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జిత్తా నగేష్, మండల అధ్యక్షుడు అట్ల గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జి.ఎర్రగుడిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రబీ కరువు మండలాల జాబితాలో తుగ్గలి లేకపోవడం అన్యాయమన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ధర్నా


హొళగుందలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

హొళగుంద, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండులో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు ధర్నా చేశారు. ఆలూరు ఎస్‌డీపీఐ ఇన్‌చార్జ్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ చట్టం బిల్లును ప్రవేశ పెట్టడాన్ని ఖండించారు. సీఎం చంద్రబాబు ఈ బిల్లును వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. సైఫుల్ల, సుభాన్, ఆఫీజ్, పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు

మద్దికెర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు నీటిని వృథా చేయకుండా, పొదుపుగా వాడుకోవాలని ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ కోరారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పైపు లీకేజీలను తనిఖీ చేసి, అవసరమైన వాటికి వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. అనంతరం వాటర్ ట్యాంకు వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

రహదారుల తనిఖీ

వెల్దుర్తి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో పల్లెపండుగలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన రహదారులను బుధవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశారు. కలగొట్ల, బోయినపల్లి, చెరుకులపాడు గ్రామాల్లో నిర్మించిన రోడ్లను తనిఖీ చేశారు. డీఈఈ ఈరన్న, ఏఈ మాధవ్ ప్రసాద్ పనుల నాణ్యతను పరిశీలించారు.

సొంత గూటికి మాజీ ఎంపీపీ


పార్టీలో చేరిన వారితో ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హొళగుంద మాజీ ఎంపీపీ గజ్జహళ్లి సిద్దప్ప తిరిగి సొంత గూటికి చేరారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో పార్టీ ఇన్‌చార్జీ వీరభద్ర గౌడ్ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ గజ్జహళ్లి సిద్దప్ప పార్టీకి విశిష్ట సేవలను అందించారని, తిరిగి సొంత గూటికి రావడంతో పార్టీ బలోపేతం అవుతుం దన్నారు. కన్వీనర్ తిప్పయ్య, ఎల్లార్తి మల్లికార్జున, తోక వెంకటేష్, మాజీ ఎంపీటీసీ కూడ్లూరు ఈరప్ప, ఐకల్ అయ్యప్ప పాల్గొన్నారు.

బస్టాండు శిథిలం


శిథిలమై, నిర్మానుష్యంగా ఉన్న బస్టాండ్

వెల్దుర్తి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తబస్టాండ్ శిథిలావస్థకు చేరింది. ఉపయోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రెండు దశాబ్దాల క్రితం ప్రయాణికులకు అందుబాటులో ఉండేది. పంచాయతీ, ఆర్టీసీ అధికారులు స్పందించి కొత్తబస్టాండ్‌కు పూర్వవైభవం తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆటిజంను అధిగమిద్దాం

హొళగుంద, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో కనిపించే ఆటిజంను అధిగమిద్దామని డీజీబుల్ పర్సన్ స్పెషల్ టీచర్ రామలక్ష్మమ్మ పిలుపు నిచ్చారు. బుధవారం హెబ్బటం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దేశంలో ప్రతి 68 మంది పిల్లల్లో ఒక్కరు ఆటిజంతో బాధపడుతున్నారన్నారు. అవగాహన లేని తల్లిదండ్రులు దీన్ని పెద్ద జబ్బుగా భావించి ఆందోళన చెందుతున్నారని, జన్యుపరమైన కారణాలతోనే ఇది వస్తుందన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- దేవనకొండ తహసీల్దార్ ప్రసాదు రాజు



దేవనకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ ప్రసాదు రాజు అన్నారు.

ప్రశ్న: మండలంలోని రెవెన్యూ గ్రామాలు, భూమి విస్తీర్ణం వివరాలు చెప్పండి.

జవాబు: మండలంలో 15 రెవెన్యూ గ్రామాలు, 69 వేల ఎకరాలు భూమి ఉంది.

ప్రశ్న: ఎన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశారు.

జవాబు: గత ప్రభుత్వంలో 5 గ్రామాల్లో చేయగా, ప్రస్తుతం కరివేముల, మాచాపురం గ్రామాల్లో రీ సర్వే చేస్తున్నాము. అయితే గతంలో మాదిరిగా రైతు లేకున్నా సర్వే చేయడం ఉండదు. కోర్టులో ఉన్న భూములు మిగతావాటికి పక్డబందీగా, అవకతవతలకు చోటు లేకుండా రీ సర్వే చేస్తున్నాం.

ప్రశ్న: భూముల ముట్యేషన్ ఎన్ని రోజుల్లో పూర్తవుతుంది

జవాబు: చుట్టుపక్కల రైతులతో విచారణ చేసి, ఫారం 8 ప్రకారం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోపు మ్యుటేషన్ పూర్తి చేస్తున్నాము.

ప్రశ్న: మండలంలో ఎన్ని రేషన్ కార్డులు, చౌక దుకాణాల డీలర్ల సంఖ్య ఎంత?

జవాబు: 22,466 రేషన్ కార్డులు, 42 దుకాణాలు, 13 ఎండీయూ వాహనాలు ఉన్నాయి.ఇ ఇంటింటికీ రేషన్ సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: పోజిషన్ సర్టిఫికెట్, బోర్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఎన్ని రోజుల్లో ఇస్తున్నారు.

జవాబు: పోజిషన్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేసుకుంటే వీఆర్వో పరిశీలన అనంతరం 15 రోజుల్లో సర్టిఫికేట్ ఇస్తాము. బోర్లకోసం వాల్టా సర్టిఫికేట్‌ను ఒక రోజులోపలే ఇస్తాం.

ఆందోళన చెందకండి : సబ్ కలెక్టర్



భూసర్వే రికార్డులను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

గోనెగండ్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో రైతులందరికీ న్యాయం చేస్తామని, ఆందోళన చెందొద్దని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. బుధవారం గోనెగండ్లలోని జరుగుతున్న భూ రీసర్వే పనులకు ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. విధులకు ఆలస్యంగా వచ్చిన ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల సర్వే సమయంలో కొంత ఎక్కువ తక్కువ వచ్చినట్లు రైతులు ఫిర్యాదు చేస్తున్నారని, అటువంటి సమస్యలను తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమార స్వామి, వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మిగనూరు డిపో ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. నిలిపివేసిన ప్రమోషన్స్‌ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులందరూ ఎర్ర బ్యాడ్జి ధరించి విధుల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో యుఎం శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

అమరావతికి తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

కోసిగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఎమ్మెల్సీగా బీటీ నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి నేతృత్వంలో టీడీపీ నాయకులు ఉలిగయ్య, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి ఆధ్వర్యంలో నాలుగు మండలాల నుంచి తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు.

నిధుల మంజూరు హర్షణీయం

ఎమ్మెల్యే బీవీని సన్మానించిన విద్యార్థి సంఘాల నాయకులు



ఎమ్మెల్యేను సన్మానించి వినతిపత్రాన్ని ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ హాస్టళ్ల పక్కా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం హర్షణీయమని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. బుధవారం ఎమ్మెల్యేను ఆ సంఘం నాయకులు రాజేష్, రఘు, ఆఫ్రీది సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అనేకసార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్తే అక్రమ కేసులు బనాయించారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే బీవీ పలుమార్లు విన్నవించడంతో వెంటనే స్పందించి అసెంబ్లీలో మాట్లాడి సంబంధిత శాఖ మంత్రితో ఎస్సీ హాస్టళ్లకు పక్కా భవనాల నిర్మాణానికి నిధులు విడుదల చేయించడం సంతోషకరమన్నారు. అలాగే ఎమ్మిగనూరులో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటు చేయాలని, ఎమ్మిగనూరు - కోసిగి రహదారి పనులను ప్రారంభించాలని ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దినకర్, ఆశోక్, వెంకటేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు



ఎంపీడీవోను సన్మానిస్తున్న దృశ్యం

కౌతాళం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఎంపీపీ అమరేశ అన్నారు. బుధవారం మండల కార్యాలయం ఆవరణలో ఎండీపీవో సత్యన్న పదవీ విరమణ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అవిశ్రాంతంగా విధులు నిర్వహిస్తూ మండల ప్రజల మన్ననలు పొందారన్నారు. అనంతరం ఎంపీడీవో దంపతులను పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ యోగేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ప్రకాశం, శివయ్య, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డు హెచ్‌ఎంకు సన్మానం

మంత్రాలయం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కామర్తి నాగభూషణం రిటైర్డు అయ్యారు. బుధవారం హెచ్ఎంను ఎం ఈవో రాగన్న, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయభారతి, పాఠశాల కమిటీ చైర్మన్ భీమయ్య, టీడీపీ నాయకులు ఎస్ఎం గోపాల్ రెడ్డి, లక్ష్మీకాంత్, బాలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రిటైర్డు హెచ్ఎంను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

మాటకు కట్టుబడిన ప్రభుత్వం

- ఎస్సీ, బీసీలకు సబ్సిడీతో సూర్యఘర్ పథకం అమలు
- పైలెట్ ప్రాజెక్టుగా హెచ్.కైరవాడి గ్రామం ఎంపిక
- బనవాసిలో 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు
- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచకుండా పాలన సాగిస్తోందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి, ఎమ్మిగనూరు విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలపై ఎనలేని భారం మోపిందని విమర్శించారు. అయితే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలను ఏమాత్రం పెంచలేదన్నారు. ప్రస్తుతం చంద్రబాబు విద్యుత్ రంగంపై ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబల్ ఇంజన్ సర్కార్‌లో పీఎం సూర్యఘర్ పథకాన్ని ఎస్సీలకు ఉచితంగాను, బీసీలకు సబ్సిడీపై అందజేసేందుకు చర్యలు తీసకుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పీఎం సూర్యఘర్ పథకం కోసం 11,252 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. బీసీలకు ప్రస్తుతం ఇచ్చే సబ్సిడీని మరింత పెంచేందుకు సీఎం ఆలోచిస్తున్నారన్నారు. గోనెగండ్ల మండలంలో ఉన్న హెచ్. కైరవాడి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశామన్నారు. ఈ పథకం పూర్తిస్థాయిలో అమలు జరిగితే విద్యుత్ బిల్లుల భారం తగ్గడమేకాకుండా విద్యుత్‌ను ప్రభుత్వానికి అమ్మేస్థాయికి చేరుకుంటామన్నారు. ఇక వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అలాగే బనవాసిలో 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు టెండర్లకు పిలిచామన్నారు. ఈ సబ్‌స్టేషన్ పూర్తయితే ఎమ్మిగనూరు ప్రాంతంలో అటురైతులు, ఇటు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో కూడా సౌర విద్యుత్‌ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఎమ్మిగనూరు డీఈ విజయరాజు, ఏడీఈ నాగేంద్రప్రసాద్, ఏఈలు ప్రసన్న ఆంజనేయులు, గురుమూర్తి, సుధాకర్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు. అంతకు ముందు 17వ వార్డులో పర్యటించారు. స్థానిక సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వక్ఫ్‌బిల్లు మద్దతు ఉపసంహరించుకోవాలి





సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు, మాట్లాడుతున్న ఇన్సాఫ్ కమిటీ నాయకుడు జబ్బార్

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బిల్లు మద్దతు ఉపసంహరించుకోవాలని ఎస్‌డీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకులు ఖాదర్ బాషా మాట్లా డుతూ టీడీపీ ముస్లిం, మైనార్టీల ఓటు బ్యాంకు ద్వారా అధికారంలోకి వచ్చి, ఇప్పుడు పార్లమెంట్‌లో ముస్లింలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వక్ఫ్ సవరణ బిల్లు చట్టానికి మద్దతు తెలపడం దుర్మార్గపు చర్య అని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, ఎస్‌డీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ఇన్సాఫ్ పట్టణ గౌరవ అధ్యక్షుడు జబ్బార్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు హజార్, సమీఉల్లాలు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు అన్యాయం చేస్తుందన్నారు. తమ న్యాయపోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో ఇన్సాఫ్ నాయకులు దాదావలి, ఖాజా, ఇస్మాయిల్, రఫిక్, నబిసాబ్, టైలర్ ఖాజా, దాదా, సమీర్ పాల్గొన్నారు.

పని వేళల్లో మార్పు చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రంగా ఉన్నాయని మున్సిపల్ కార్మికుల పని వేళల్లో మార్పు చేయాలని ఏఐటీయూసీ నాయకులు యల్లప్ప, వీరేష్, తిమ్మగురుడులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు ఎండల ప్రభావం అధికమవుతుందన్నారు. మున్సిపల్ కార్మికులు ఎండలో పనిచేసి వడదెబ్బకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల పనిదినాలలో మార్పు చేయాలన్నారు. కార్యక్రమంలో విజయేంద్ర, శివ, సల్మాన్, మల్లారెడ్డి, వెంకటరాముడులు పాల్గొన్నారు.

దివ్యాంగులను గౌరవించాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

పెద్దకడుబూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను గౌరవించాలని మెయిన్ స్కూల్ ఉపాధ్యాయుడు నరసింహులు అన్నారు. బుధవారం పెద్దకడుబూరులోని భవిత సెంటర్‌లో ప్రపంచ ఆటిజం అవేర్నెస్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఎక్కడ ఉన్నా గౌరవించాలని, వారిలో ఉన్న ఒంటరితనాన్ని తొలగించి సమాజంలో ఉన్నతంగా చూడాలన్నారు. పిల్లల్లో ఆటిజం సమస్యను చిన్న వయస్సులోనే గుర్తించి సమస్యకు పరిష్కారం కోసం వైద్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. భవిత సెంటర్‌కు వచ్చే విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేశవ్, మల్లికాబేగం, సహితా ఉపాధ్యాయులు గోపాల్, సుబ్బారాయుడు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

గోనెగండ్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీపేట మొదటి వీధిలో విద్యుత్ అధికారులు స్తంభాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం కాలనీకి చెందిన మహిళలు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పాత స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయించారని మహిళలు తెలిపారు.

అక్రమ కేసులు బనాయించడం సరికాదు: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి గోపాల్

కోసిగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరితే పెద్దకడుబూరు సీపీఐ నాయకులపై కేసులు నమోదు చేయడం సరికాదని సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ అన్నారు. బుధవారం కోసిగిలోని స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారును కోరితే.. సీపీఐ నాయకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పార్టీ పోరాడుతూనే ఉంటుందన్నారు. సీపీఐ నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు ఓంకార్ స్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్, పరుశురాం, అల్లయ్య పాల్గొన్నారు.

అభ్యంతరాలపై ఫిర్యాదు చేయాలి



నోటీసులు ఇస్తున్న తహసీల్దార్, సర్వేయర్లు

మంత్రాలయం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రీ సర్వేపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ ఎస్.రవి సూచించారు. బుధవారం చెట్నహల్లి గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రైతులు సెంటు భూమి నష్టపోకుండా తమ అనుభవంలో పట్టాదారులో ఎంత ఉంటే అంత నిక్కచ్చిగా పొందు పరుస్తామన్నారు. రైతులకు భూమి పై ఏ వ్యత్యాసం వచ్చినా 10(2) ద్వారా అప్పీలు చేసుకోవాలని కోరారు. ఇలాంటి భూముల్లో ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తామని ఫీల్డ్‌కు వెళ్లి మరోసారి భూమి కొలతలు చేసి రైతులకు అన్నివిధాలా న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి, మండల సర్వేయర్ అశోక్, వీఆర్వో భీముడు, సర్వేయర్లు నవీన్ కుమార్, తిమ్మేష్, ఉరుకుందాచారి, ధరణి, భవిత, శోభా, శేఖర్ నాయక్, అనూష, హరిత, భీరప్ప, నాగమణి, రాధారాణి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ అయ్యమ్మ

కోసిగి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కోసిగి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కుమారి ఎస్.అయ్యమ్మ బుధవారం కోసిగి మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచ్ అయ్యమ్మ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని, దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర రెడ్డి, సచివాలయ, గ్రామ పంచాయతీ సిబ్బంది, నాయకులు మాణిక్య రాజు, ఎల్లయ్య, షంషుద్దీన్, రహీం తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం



వెండి రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం చైత్ర మాస చవితి శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. అనంతరం వెండి రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చి ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు.

శ్రీమఠానికి విరాళం: రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన ప్రవీణ్, సుష్మా అనే భక్తులు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. బుధవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.లక్ష నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబాన్ని ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీపాధాచార్, గిరిధర్, జేపీ స్వామి పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రపై అవగాహన



కరపత్రాలను విడుదల చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

మంత్రాలయం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జీవిత చరిత్రపై కళారూపం నాటకం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రదాన కార్యదర్శి ఎండీ ఆనందబాబు అన్నారు. బుధవారం మంత్రాలయంలో కేవీపీఎస్ నాయకుల ఆధ్వర్యంలో సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న మాధవరంలో అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలియజేసే నాటకాన్ని ఆదునిక హంగులతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా నాటకాన్ని తిలకించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, మండల కార్యదర్శి అంజి, మాజీ మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, అనిల్, సురేష్, మారెప్ప, దానియేలు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సంపు వద్ద చెత్తాచెదారం



చిలకలడోనలో తాగునీటి సంపు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

మంత్రాలయం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోన గ్రామంలో తాగునీటి సంపు వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుంది. అలాగే బీసీ కాలనీలో సిమెంట్ రోడ్డు ధ్వంసమైనా మరమ్మతులు చేయించేవారు కరువైయ్యారు. ఆదారిలో రాకపోకలు సాగించాలంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ధ్వంసానికి గురై ఐదేళ్లు కావస్తున్నా సర్పంచ్, నాయకులు పట్టించుకోవడం లేదు. మురుగు రోడ్డుపై ప్రవహిస్తూ దోమలు, పందులకు నిలయంగా మారింది. అధికారులు స్పందించి రోడ్లు, కాలువలు శుభ్రం చేయించి, తాగునీటి కొళాయి సంపు వద్ద చెత్తాచెదారాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థినులపై వ్యక్తి అసభ్య ప్రవర్తన

స్టేషన్‌కు తరలించిన పోలీసులు



విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించారు. ఈ ఘటన పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముగతి గ్రామానికి చెందిన ఈరన్న అనే వ్యక్తి బస్టాండ్ ప్రాంతంలో ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. మద్యం తాగి బాలికల పాఠశాల ముందు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థినులు భయాందోళనకు గురికాగా, గమనించిన స్థానికులు, పాఠశాల సిబ్బంది అతడిని అడ్డుకొని, దాడి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పోలీసులు పాఠశాలకు చేరుకొని నిందితుడిని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా సదరు వ్యక్తికి మతిస్థిమితం లేదని, విచారించి సాయంత్రం వారి బంధువులను పిలిపించి అప్పగించినట్లు తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలి



వేలం నిర్వహిస్తున్న సర్పంచ్

గోనెగండ్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ కోరారు. బుధవారం గోనెగండ్ల మేజర్ పంచాయతీ కార్యాలయంలో కబేళా, బండిమెట్ట, వారాంతపు సంతమార్కెట్‌కు వేలం నిర్వహించారు. కబేళాను బలిగిరి షిడ్డీ, రూ. 83వేలు, బండిమెట్టను బడేసాబ్ రూ. 1,21లక్షలు, వారాంతపు సంతమార్కెట్‌ను గంద్రగొడ్డలి శ్రీను రూ. 84500లకు దక్కిం చుకున్నారు. గతేడాది కంటే ఈయేడు పంచాయతీకి ఆదాయ పెరిగింది. సమావేశంలో చంద్రశేఖర్, అనిల్, మలాంగ్, సుభాన్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.